రామయ్యకు పునర్వసు కల్యాణం

ప్రత్యేక అలంకరణలో సీతారామచంద్రస్వామి

పర్ణశాల, మార్చి 19 : పునర్వసు నక్షత్రం సందర్భంగా పర్ణశాల సీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారికి మంగళవారం అర్చకులు పునర్వసు కల్యాణం నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు స్వామివారి కల్యాణ ఘట్టం ప్రారంభమైంది. కల్యాణ క్రతువు, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, యంత్రధారణ, రక్షా బంధనం, యజ్ఞోపవీతధారణ, మహా సంకల్ప మంగళాష్టకాలు, మధుపర్కాలు, జీలకర్ర బెల్లం సమర్పణ, మాంగల్యాధారణ పూజ, మంత్రపుష్పం వంటి కార్యక్రమాలను అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించిన భక్తులు పులకించిపోయారు. కార్యక్రమంలో ముఖ్య అర్చకుడు కిరణ్‌కుమారాచార్యులు, వెంకట్రామాచార్యులు, ఆలయ ఇంఛార్జి ప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ అనిల్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లెందు మండలం దనియాలపాడు చెరువులో ఇంకిపోయిన నీరు

తడారుతున్న తటాకాలు.. ఎండుతున్న పొలాలు

- ఇల్లెందు, అశ్వాపురం మండలాల్లో యాసంగికి గడ్డు పరిస్థితి
- సింగభూపాలెం చెరువులో నీరు తగ్గడంతో కాలువల్లోకి రాని నీరు
- పొట్ట దశలోనే ఎండిపోతున్న వరి పొలాలు
- ఎండలకు వడలిపోతున్న కూరగాయల పంటలు
- సాగు రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన

బోర్లు, చెరువుల్లో నీరు అడుగంటడంతో రైతుల ఆందోళన

సుజాతనగర్ మండలం సింగభూపాలెం చెరువులో తగ్గిన నీటిమట్టం

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : ఎన్నో ఆశలతో యాసంగి సీజన్‌లో రైతులు వరితోపాటు కూరగాయల పంటలు సాగు చేశారు. స్థానికంగా ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని పంటలు సాగు చేసినా పూర్తి వేసవి రాకముందే చెరువులు, బావులు, కుంటల్లో నీరు అడుగంటడంతో రైతులు దిగులు చెందుతున్నారు. వానకాలం సీజన్‌లో చెరువులు, బావుల్లో సమృద్ధిగా నీరుండడంతో వరితోపాటు సాగు భూముల ఆధారంగా వివిధ రకాల పంటలు పుష్కలంగా పండించుకున్నారు. ప్రస్తుత యాసంగిలో సాగు చేసిన పంటలకు నీరందకపోవడంతో పొట్ట దశలో ఉన్న వరి పంటలు ఎండిపోతున్నాయి. కూరగాయల పంటలకు సైతం నీరందక వడలిపోతున్నాయి. దీంతో జిల్లావ్యాప్తంగా సాగు చేసిన పంటలను మధ్యలోనే వదిలేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. కొందరు రైతులు నీటి వనరులను ముందస్తుగా అంచనా వేసి మాగాణి భూములను వదిలేయడంతో అవన్నీ బీళ్లుగా మారాయి. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి రంది లేకుండా రెండు పంటలు పండించుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరువు రావడంతో ఏమి చేయాలో తోచక సాగు రైతులు ఆందోళన చెందుతున్నారు.

గత ఏడాది యాసంగి సీజన్‌లో జిల్లాలో 60 వేలకుపైగా ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా.. ఈ ఏడాది 40 వేల ఎకరాల్లో సాగు చేశారు. వర్షాభావ పరిస్థితులు, జలాశయాలు, చెరువులు, బావుల్లో నీరు అట్టడుగు స్థాయికి చేరడం, కాంగ్రెస్ ప్రభుత్వం రెండు, మూడు ఎకరాలలోపు రైతులకే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమ చేయడంతో మిగిలిన రైతులు సాగు పనులకు స్వస్తి చెప్పారు. చేసేది లేక కొందరు రైతులు వరి పొలాల్లో ప్రత్యామ్నాయంగా పామాయిల్ సాగుకు సిద్ధమయ్యారు. రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ మొక్కలు నాటుతున్నారు.

మూడు ప్రాంతాల్లో యాసంగి కష్టాలు

పినపాక నియోజకవర్గం అశ్వాపురం మండలంలో తుమ్మల చెరువు కింద గత ఏడాది రెండు కాలువల ద్వారా నీరందడంతో 8,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ ఏడాది రెండో కాలువ ద్వారా నీళ్లు రాకపోవడంతో 4,200 ఎకరాల్లోనే రైతులు వరి వేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఆ మండలంలో సాగునీటి సమస్య తలెత్తకుండా మారెళ్లపాడు లిఫ్టును మంజూరు చేసింది. కానీ.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిపై శ్రద్ధ చూపకపోవడంతో అది కార్యరూరం దాల్చలేదు. దీంతో అక్కడ రెండో కాలువకు నీరందలేదు.

సింగభూపాలెం కాలువలో ముందుకు పారని నీరు

ఇల్లెందు మండలం దనియాలపాడులో ఒక రైతు వేసిన మిర్చి పంట చేతికి రాకపోవడంతో సదరు రైతు ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. కానీ.. అక్కడి రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఉన్న బోర్లలో నీళ్లు రాక.. చెరువుల్లో చుక్క నీరులేక వేసిన మొక్కజొన్న పంట కంకి దశలోనే తేలిపోతుంది. దీంతో కంకులు తీయడానికి రాక రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొత్తగూడెం నియోజకవర్గం సుజాతనగర్ మండలంలోని సర్వారం గ్రామంలో పంట పొలాల్లో మోటర్లు ఉన్నా విద్యుత్ సక్రమంగా రాకపోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయి. దీంతో తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. అక్కడి రైతులు వేసిన టమాట పంట వడలిపోయింది. ఉప్పరిగూడెంలో మరో రైతు హరి పొలంలో బోరు ఉన్నా నీరు పూర్తిస్థాయిలో లేకపోవడంతో పంట వేయలేదు. సింగభూపాలెం చెరువులో నీటిమట్టం తగ్గడంతో అంజనాపురం రైతుల పంట కాలువలోకి నీరు రావడం లేదు. దీంతో ఆ ప్రాంత రైతులు కూడా యాసంగి సాగుపై ఆసక్తి చూపలేదు.

బోరు వేసినా నిరుపయోగమే..

ఎకరం భూమికి బోరు వేసినా ఒక పంటకే నీళ్లు సరిపోతున్నాయి. దీనికి తోడు కరెంటు కోతలు ఎక్కువగా ఉండడంతో రెండో పంట వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు తగ్గించింది. ఐదెకరాల్లోపు వారికే వస్తుంది. పదేళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు దుమ్ముగూడెం నుంచి కాలువ వస్తదని నాయకులు ప్రగల్భాలు పలికారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాలువ కోసం ఎదురు చూస్తూనే ఉన్నాం.

–మాలోత్ హరి, రైతు, ఉప్పరిగూడెం, సుజాతనగర్ మండలం

రైతుల కష్టాలను పట్టించుకోవట్లేదు..

మా ప్రాంతంలో చెరువులు లేవు. ఉన్న చెరువు ఎండిపోయింది. పొలంలో బోరు ఉన్నా నీరు రావడం లేదు. దీంతో మిర్చి పంట వేసి చాలా నష్టపోయాను. ఇక్కడి సాగునీటి సమస్యపై, రైతుల కష్టాల గురించి పట్టించుకునే వారు లేరు. పోడు భూముల్లో బోర్లు వేస్తే అటవీ శాఖ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు. ఇంకా ఎంత కాలం కష్టాలో అర్థం కావట్లేదు.

–లకావత్ లాలు, రైతు, దనియాలపాడు, ఇల్లెందు మండలం

నీరు లేక తడారిన టమాట పంట

ఎన్నికల నిర్వహణలో లోపాలు ఉండొద్దు..

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్

ప్రలోభాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు : సీపీ సునీల్‌దత్

మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, మార్చి 19 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ఎక్కడా లోపాలు లేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో కీలకమైన ఎన్నికల విధుల్లో చిన్న తప్పిదానికి తావివ్వకుండా అంతా సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న స్క్రూట్నీ, 29 వరకు అభ్యర్థుల ఉపసంహరణ ఉండగా.. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు వాహనాలు సమకూర్చామని, నిఘా బృందాలు తమకు కేటాయించిన ప్రదేశాల్లో విధులు నిర్వర్తించాలన్నారు. క్రిటికల్, వనరబుల్ పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ పూర్తి కావాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలు వంద శాతం ఏర్పాటు చేయాలని, పోలీసుల నివేదిక మేరకు కేంద్రాల వెలుపల సీసీ కెమెరాలు ఉండాలన్నారు. ఏఆర్వోలు, పోలీస్ అధికారులు తమ పరిధిలోని ప్రతి కేంద్రాన్ని సందర్శించి.. మౌలిక సదుపాయాలు, భద్రతా పరంగా చేపట్టాల్సిన చర్యల గురించి కార్యాచరణ చేయాలన్నారు. సువిధ సింగిల్ విండో ద్వారా అనుమతులు జారీ చేయాలని, నిర్ణీత కాలవ్యవధిలోగా అనుమతులు ఇచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఆయా సెగ్మెంట్ల పరిధిలోనూ, రిసెప్షన్ కేంద్రం కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల పరిశీలకులు సందర్శించేలోగా కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సీ-విజిల్ పై యువతతో సమావేశాలు నిర్వహించి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. 85 ఏళ్ల పైబడిన వారికి, దివ్యాంగులకు హోం ఓటింగ్ నిమిత్తం ఫారం-12డీలను ఇంటింటికీ అందజేయాలన్నారు.

ప్రలోభాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు : సీపీ

అక్రమ నగదు, లిక్కర్ పంపిణీ, ప్రలోభాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సీపీ సునీల్‌దత్ ఆదేశించారు. జిల్లాలో 12 ఎఫ్ఎస్టీ, 15 ఎస్ఎస్టీ, 2 ఇంటిగ్రేటెడ్ ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు, 10 ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు, 8 ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి.. 24 గంటల నిఘా ఉంచినట్లు తెలిపారు. ప్రచార సామగ్రిపై ప్రచురణకర్త పేరు, వివరాలు లేకుంటే సీజ్ ఆయా షాపులను చేయాలన్నారు. సీజర్ సమయంలో అన్ని నియమనిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. క్రిటికల్, వనరబుల్ పోలింగ్ కేంద్రాల గుర్తింపు మార్గదర్శకాల మేరకు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, శిక్షణా ఐపీఎస్ పి.మౌనిక, అదనపు డీసీపీ ప్రసాదరావు, భద్రాద్రి కొత్తగూడెం అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, ఖమ్మం, కల్లూరు, కొత్తగూడెం ఆర్డీవోలు గణేశ్, శ్రీనివాస్, మధు, డీసీవో మురళీధర్ రావు, ఐటీ అధికారి సాయికుమార్, జిల్లా శిక్షణ నోడల్ అధికారి కే.శ్రీరామ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వండి

డీఆర్‌డీవో విద్యాచందన

నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో విద్యాచందన

పాల్వంచ రూరల్, మార్చి 19 : పండ్ల మొక్కలతో పాటు ప్రజలకు ఉపయోగపడే మొక్కలను నర్సరీల్లో పెంచడానికి ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో విద్యాచందన అధికారులకు సూచించారు. లక్ష్మీదేవిపల్లి, బసవతారకకాలనీ, జగన్నాథపురం, కేశవాపురం పంచాయతీల్లోని నర్సరీలను ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా జగన్నాథపురం నర్సరీ వద్ద అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా నిరంతరం నీరు అందించాలన్నారు. మొక్కలు ఎండిపోయిన బ్యాగుల్లో మళ్లీ కొత్త మొక్కలకు సంబంధించిన గింజలు వేయాలన్నారు. మొక్కల సముదాయం ముందు ఆయా మొక్కల పేర్లు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నర్సరీల్లో నూరు శాతం పచ్చదనం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఏపీవో పోరండ్ల రంగా, పంచాయతీ కార్యదర్శులు కృష్ణవేణి, రాంబాబు, సాయిరాం, క్షేత్రస్థాయి సిబ్బంది నాగేశ్వరరావు, శంకర్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

మాట్లాడుతున్న టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

కొత్తగూడెం టౌన్, మార్చి 19 : ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవోస్) రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం రాత్రి జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు కుటుంబ, ఉద్యోగ వ్యవహారాల్లో సహకరించి.. వారి సమస్యలను అర్థం చేసుకొని కుటుంబ సభ్యులు ముందుకు సాగాలని కోరారు. జిల్లా అధికారుల్లో సగభాగం మహిళలు ఉండడం మంచి పరిణామమన్నారు. జిల్లాలో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మహిళలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, వారందరి సహకారంతో జిల్లా అభివృద్ధిలో ముందుకు సాగుతోందన్నారు. పాలనాధికారిగా జిల్లాను ముందుకు నడిపించడం పట్ల కలెక్టర్ ప్రియాంక ఆలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కాగా.. జిల్లాకు తొలిసారిగా వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావును టీజీవోస్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంగం వెంకటపుల్లయ్య, డాక్టర్ విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, దస్రూ, అబ్రహం, తిరుపతి, కనకదుర్గ, దుర్గమ్మ, రుక్మిణీదేవి, విజేత, తిరుమలేశ్, శ్రీనివాస్, ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం మెడికల్ కాలేజీ ఎదుట రెండోరోజూ నిరసన

కొత్తగూడెం మెడికల్ కళాశాల ఎదుట ప్లకార్డులతో వైద్య విద్యార్థుల ప్రదర్శన

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మార్చి 19: కొత్తగూడెం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్‌రావు వేధింపులు తాళలేకున్నామని, ఆయన ప్రవర్తన తీరు మార్చుకోవాలని, అలాగే కాలేజీ పరిధిలో యాజమాన్యం మౌలిక వసతులు కల్పించాలని మెడికల్ విద్యార్థులు మంగళవారం రెండోరోజూ ప్లకార్డులతో రోడ్డెక్కి నిరసన చేపట్టారు. ఎన్నో ఆశలతో కళాశాలలో అడుగుపెట్టామని, కానీ ఇక్కడ వైద్యవిద్యకు అవసరమైన వసతులు లేవని మండిపడ్డారు. హాస్టళ్లు ప్రైవేటు భవనాల్లో నడుస్తున్నాయని, సొంత భవన నిర్మాణాలకు ఒక్క అడుగైనా ముందుకు పడలేదన్నారు. కొద్దిగంటల తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖమ్మం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావుతో సహా మరో ముగ్గురు ప్రతినిధులు కొత్తగూడెం మెడికల్ కాలేజీకి వచ్చి విచారణ చేపట్టారు. వైద్య విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినుల వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించారు. త్వరలోనే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు.

విచారణ కమిటీ నియామకం

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 19 (నమస్తే తెలంగాణ): కొత్తగూడెం మెడికల్ కాలేజీలో నెలకొన్న సమస్యలపై విచారించేందుకు కలెక్టర్ ప్రియాంక ఆల మంగళవారం జడ్పీ సీఈవో ప్రసూనరాణి అధ్యక్షతన విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులుగా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి కె.సూర్యనారాయణను నియమించారు. సభ్యులు విచారణ పూర్తి చేసి ఈనెల 22 సాయంత్రం ఐదు గంటల్లోపు కలెక్టర్‌కు నివేదిక అందించాల్సి ఉన్నది.

'ఎక్స్‌టర్నల్ పోస్టుల్లో ట్రైనీ అభ్యర్థులకు అన్యాయం'

సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెం సింగరేణి, మార్చి 19: సింగరేణిలో వెలువడిన ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌లో ఐటీఐ (ఫౌండ్రిమెన్/మౌల్డర్ ట్రైనీ) అభ్యర్థులకు అన్యాయం జరిగిందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం వారు సీఎండీ బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఫౌండ్రిమెన్, మౌల్డర్ ట్రైనీ అభ్యర్థులకు ఒక్క పోస్టు కూడా కేటాయించలేదని, ఇలాంటి నోటిఫికేషన్ ఎప్పుడు సింగరేణిలో చూడలేదన్నారు. ఈసారి నోటిఫికేషన్ కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న తమకు ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల అవకాశాలు మెరుగవుతాయని అనుకున్న తమకు నోటిఫికేషన్ చూసి నిరాశ చెందాల్సి వస్తుందని అన్నారు. సింగరేణి, ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ టోర్నీ ప్రారంభం

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సీఈ వెంకటేశ్వరరావు తదితరులు

పాల్వంచ, మార్చి 19 : పాల్వంచలోని కేటీపీఎస్ విద్యుత్ కళాభారతి మైదానంలో టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ వాలీబాల్, లాన్ టెన్నిస్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఏడో దశ సీఈ వెంకటేశ్వరరావు, 5, 6 దశల సీఈ ప్రభాకర్‌రావు, ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాసబాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన లాన్ టెన్నిస్ సింథటిక్ కోర్టును వారు ప్రారంభించారు. టోర్నమెంట్‌లో థర్మల్, హైడల్ స్టేషన్ నుంచి భూపాలపల్లి(కేటీపీపీ), పోచంపాడు, ఆర్‌టీఎస్ రామగుండం, విద్యుత్ సౌధ, జూరాల, పులిచింతల, బీటీపీఎస్ మణుగూరు, శ్రీశైలం, నాగార్జునసాగర్, కేటీపీఎస్ ఏడో దశ, కేటీపీఎస్ 5, 6 దశల క్రీడాకారులు పాల్గొన్నారు. కాగా.. రాష్ట్రస్థాయిలో జరిగే ఈ పోటీలకు కేటీపీఎస్ ఆతిథ్యమిచ్చింది. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ కే.శ్రీనివాసబాబు, జనరల్ సెక్రటరీ లోహిత్ ఆనంద్, ఎస్ఈ(సివిల్) యుగపతి, డీఈ శేఖర్, వై.వెంకటేశ్వర్లు, వీరస్వామి, వీరునాయక్, వెంకటేశ్వర్లు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌ల మార్పు?

పరీక్షల పకడ్బందీ నిర్వహణపై అబ్జర్వర్, డీఈవో, ఏసీల సమావేశం

డీఈవో, ఏసీతో మాట్లాడుతున్న జేడీ సర్వీసెస్, జిల్లా అబ్జర్వర్ మదన్‌మోహన్

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 19 : జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనల విషయంలో అలసత్వం వహిస్తే ఎంతటి వారైనా చర్యలు తీసుకునేందుకు వెనుకాడడం లేదు. పరీక్షల తొలిరోజు రూరల్ మండలం ఎదులాపురం కేంద్రంలోకి నిబంధనలకు విరుద్ధంగా కారు తీసుకొచ్చిన ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించారు. పరీక్షా కేంద్రాల్లో అమర్చిన సీసీ కెమెరాల ద్వారా ఎవరెవరు వస్తున్నారనే అంశాలను కలెక్టర్ పరిశీలిస్తున్నారు. కాగా.. మంగళవారం పరీక్ష జరిగిన అనంతరం జిల్లా అబ్జర్వర్ మదన్‌మోహన్, డీఈవో సోమశేఖర శర్మలు పరీక్ష తీరుపై కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కలిసి వివరించారు. పరీక్షల నిర్వహణ విషయంలో అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు తప్పవని కలెక్టర్ సూచించినట్లు తెలిసింది. కలెక్టర్‌ను కలిసిన తర్వాత జిల్లా అబ్జర్వర్, డీఈవో, పరీక్షల విభాగం ఏసీలు సమావేశమయ్యారు. రెండు రోజుల పరీక్షల తీరుపై సమీక్షించారు. అయితే పర్యవేక్షణలో భాగమైన 6 ఫ్లయింగ్ స్క్వాడ్‌లలో రెండు బృందాల్లో మార్పులు చేయనున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల్లోని అధికారుల మార్పుపై ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు కూడా తెలుస్తోంది. దీనిపై బుధవారం నిర్ణయం తీసుకోనున్నారు. మంగళవారం జరిగిన హిందీ పరీక్షలో 16,571 మందికి.. 16,530 మంది హాజరై 41 మంది గైర్హాజరు కాగా.. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు.

'పామాయిల్ తోటలకు నీటి తడులివ్వాలి'

మాట్లాడుతున్న బాలకృష్ణ

అశ్వారావుపేట, మార్చి 19 : ఎండల దృష్ట్యా పామాయిల్ తోటలకు రైతులు నీటి తడులు ఎక్కువగా ఇవ్వాలని, లేనిపక్షంలో దిగుబడులు తగ్గే పరిస్థితి ఉన్నదని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతానికి ఆయిల్‌పాం గెలల దిగుబడి తక్కువగా ఉన్నదని, నీటి తడులు ఎక్కువగా ఇవ్వకపోవడంతో గెలల ఎదుగుదల తగ్గుతుందని చెప్పారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. పోడు పట్టాదారులతోపాటు పాత భూమి హక్కు పత్రాలు ఉన్నా రాయితీ పథకాలను ఆయా రైతులకు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా ఆయిల్‌పాంపై ఆసక్తి ఉండి.. పంట సాగు చేయాలనుకునే రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాగు విధానంపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటారని ఆయన చెప్పారు.